# యతులు-శిలలు-పన్నీరు

'పేరులోన నేమి పెన్నిధి యున్నది?' అని అనేక మార్లు గుర్తుచేసుకుందుకు ప్రయత్నించినా 'నారాయణా!' అని ఎవరన్నా పిలిచినట్లు వినిపించినప్పుడల్లా అటువేపు తిరిగి చూడడం తప్పకుండా వస్తోంది, నిర్మలానందస్వామికి.

పూర్వాశ్రమంలో అతని పేరు నారాయణే. ఆ సంగతి ఆశ్రమంలో ఎవరికీ తెలీదు. అతను యిక్కడికి వచ్చిన రెండేళ్ళలోనూ ఎవరూ సన్నిహితులు యేర్పడలేదు. 'మూలస్వామి' ఆరాధనకు అవసరం అయిన సరంజామా ఎప్పటికప్పుడు ఏమరుపాటు లేకుండా తెప్పించివుంచి అయాసమయాలలో ఆయత్తం చేసి యివ్వడమే అతనికి యిక్కడ కేటాయించిన పని. ఈ పనికి భంగం లేకుండా అతని స్వధర్మాలన్నీ తీర్చుకోవచ్చు ఆశ్రమంలో యితర సాధకులు, సేవకులు అందరూ అతనంటే గౌరవంగా వుంటారు. ఒకరిపనిలో అయన జోక్యం కలిగించుకోరు- మరొకరిని తన పనిలో వేలు పెట్టనివ్వరు....యిదీ అతన్ని గురించి యితరులు మాట్లాడుకోవడం అప్పుడప్పుడు వినిపడుతూవుంటుంది. అయినా తనకే ఏమీ తెలియనట్లు, నిమిత్తంలేనట్లు ఉండిపోవడం నిర్మలానందస్వామి సహజలక్షణం అయిపోయింది.

సేవకుల్లో ఒకడి పేరు నారాయణ. నిర్మలానందస్వామి యిక్కడకు రాకముందునుంచీ వున్నాడు అతను. ఇద్దరి వయసు దాదాపు ఒకటే. అయినా ఆ నారాయణకు భార్య, పిల్లలు, సంసారం, సంవిధానం అంతా ఉన్నట్లుంది. ఆ నారాయణే యితనికీ కావలసిన వస్తువులు అమర్చడంలో నిర్విరామంగా పనిచేసే మనిషి-నిర్మలానందస్వామికి ఒక్కడినే కాదు... ఈ ఆశ్రమంలో వున్న మరో యిద్దరు యతులకు అవసరం అయిన సేవలు చేయడానికి కూడా అన్నప్పుడల్లా ముందుకు వచ్చేది అతనే!

నారాయణ ఇంగ్లీషు పేపరు తెచ్చియిచ్చాడు.

అప్పటికి నిర్మలానందస్వామి ఉదయ కార్యక్రమం అయిపోయింది. స్వామికి బాలభోగం అయి్ంది గనుక మధ్యాహ్నాం పన్నెండు గంటల వరకు ఆశ్రమవిధులేవీ అతని చేతులమీదుగా జరుగవలసినవి లేవు. పేపర్ చేతుల్లోనికి తీసుకున్నాడు. అలవాటు ప్రకారం మొదటి "పేజి, ఎడిటోరియల్ పేజి, ఉత్తర వ్యవహారం అయిపోయిన తర్వాత ఆ పేజీ

తిప్పి మరణించిన వాళ్లను గురించిన ప్రకటనలు, ఫొటోలు చూడటం చేశాడు. దాదాపు యిరవై ఎంట్రీలు వున్నాయి ఈ రోజు. అయినా వాటిలో మధ్యలో వున్న ఒక పేరు మీదనే అతని దృష్టి ఆనింది.

"సరస్వతి (65)రిటైర్డ్ జస్టిస్ వెంకటస్వామి భార్య రిటైర్డ్ ఛీఫ్ ఇంజినీయర్ గోవిందనాయకం కుమార్తె.

భర్తను బంధువుల్ని వదలి వైకుంఠధామం చేరుకున్నారు. -కన్నీటితో కొడుకులు, కూతుళ్ళు, కోడళ్లు, అల్లుళ్ళు మనుమలు, మనమరాళ్లు..."

తేదీ, సమయం, యితర వివరాలు, కాంటాక్ట్‌ఫోన్ నెంబరు వున్నాయి కింద.

తరువాతి పేజీ చూసినపుడు సరస్వతి ఫొటో కనిపించింది. పరితాపం ప్రకటిస్తూ కొన్ని కంపెనీల యాజమాన్యాల పేర్లు వున్నాయి. ఫోటోలో సరస్వతికి పాతిక, ముప్పయి యేళ్ళకంటె ఎక్కువ వుండవు.

ఆ ఫోటోవంక అయిదు నిమిషాలపాటు చూచిన తరువాతగాని నిర్మలానందస్వామికి స్ఫురించలేదు. యీ వార్తకు తను ఎక్కువగా స్పందిస్తున్నానని.

సరస్వతి పోయిందన్నమాట!

ఆ జీవుడి వేదన యివ్వటికన్నా సమిసిపోయిందా?

నిర్మలానందస్వామి దాదాపు అరగంటసేపు కళ్లు మూసుకుని వుండిపోయాడు. మనోనేత్రం ముందు సరస్వతీపీఠం వేసుకు కూర్చుంది. చలించకుండా ఆమె వంకే చూస్తు కూర్చుండిపోయాడు. 'సరస్వతి మూర్తి' కదలకుండా వుండిపోయింది ఆ అరగంటసేపూ. తరువాత మెల్లిగా మంచువిడిపోయినట్లు, ఆవిరిగాలిలో కలిసిపోతూన్నట్లు వస్తువుల వైశాల్యం కరిగిపోతున్నట్లు-రూపం కనిపించకుండా అదృశ్యం అయిపోయింది. సరస్వతి ఆ రూపం పొందాక నిర్మలానందస్వామి కళ్లు తెరిచాడు. స్నానాలగదిలోనికి వెళ్లి కాళ్లుచేతులు ప్రక్షాళన చేసుకున్నాడు. ఆచమనం చేశాడు. మళ్లీ వచ్చి తన ఆసనంలో తీరుగా కూర్చుండిపోయాడు.

యతి అయినా కాకపోయినా డెబ్బయి సంవత్సరాల వయస్సు వుంది తనకు, జీవితంలో విశేష అనుభవం వున్నదని చెప్పలేదుగాని అన్నిటినీ సమంగా చూడడం, ఉన్నవి ఉన్నట్లుగా చూడడం చిన్నతనం నుంచి అలవాటు అయిపోయింది. అందుకు ప్రత్యేక ప్రయత్నం అవసరం లేకుండా అన్నీ అనుకూలంగానే అమరుతున్నాయి. ఎప్పటి సరస్వతి! నలభయియేళ్లకిందటిమాట! ఇంకా కొన్నివేల సంవత్సరాల క్రిందటి సమాచారం అయినా కావచ్చును. ఎందుకంటే సరస్వతి అంటుంది- మనకు పూర్వజన్మల్లో కూడా సంబంధం వుండివుందని లేకపోతే ఈ జన్మలో- చూచిన మొదటిక్షణం నుంచి యింత ఆప్యాయత తొణికిసలాడవలసిన అవసరం లేదు!

'పూర్వజన్మలు, వాటి వేదాంతాలను గురించి చాలామంది చర్చించుకోవడం,

అందుకు కొన్ని పుస్తకాలు కూడా ఆధారంగా చెప్పుకోవడం నారాయణ-అప్పటికి యింకా నిర్మలానందస్వామి కాలేదు- వింటూనే వున్నాడు. అయితే ఈ రకమైన జిజ్ఞాస అతనికి ఏ మాత్రమూ అభిరుచిదాయకం కాదు. మనిషి 'ప్రస్తుతాన్ని' గురించే ఆలోచించాలి. ప్రస్తుత క్షణాన్ని నిండుగా చూచి మనగలగాలి. దానిలో ఒదిగిపోవాలి అంతేకాని పూర్వం గురించి, పరిణామం గురించి ఆలోచిస్తూ కూర్చోనవసరం లేదు.

'అయితే పూర్వజన్మలు-భూతభవిష్యత్తులు-యివన్నీ లేవంటావా?' అని నిలదీసి అడిగింది సరస్వతి ఒకరోజు.

'లేవని నేను అనను. కాని వాటిని పట్టించుకోవడం అనవసరం అంటాను'

'జీవితంలో యింత వేదాంతం రంగరించుకున్నవాడివి. నువ్వు ఈ "ఆనర్స్" ఎందుకు చదువుతున్నావో నాకు అర్థం కాదు...' అంది సరస్వతి మరోమారు. ఆమె మాటల్లో కొంటెతనం, ఎగతాళి, కొద్దిగా కోపం మిళాయించి వున్నాయి. ఎందుకు చదువుతున్నాడో నారాయణకు కూడా అర్థంకాదు. యాంత్రికంగా అలా చదువుకుంటూ పోతున్నాడు, అంతే! ఆ సబ్జక్ట్ మీద అభిరుచి వుండికాదు, అది చదవకపోతే జీవితం కడతేరదనీ కాదు.

అక్షరాభ్యాసం-స్కూలు-చదువు-మెట్లుమెట్లుగా చదువుకుంటూపోవడం...జీవితంలో అర్థం, పరమార్థం యిదే అని తెలియడానికి చాలా రోజులుపట్టింది.

'ఈ చదవులన్నీ అయిన తర్వాత యేంచేస్తావ్, మరి?' అని సరస్వతి అన్నప్పుడు 'సన్యాసం పుచ్చుకుంటాను'-అంటే ఏదో ఎగతాళిగా అంటున్నాడు- అనుకుందిగాని అదే అతని దృఢసంకల్పం అని ఆమెకు ససేమిరా తెలియదు. నమ్మబుద్ధికాదు.

'చూడు నారాయణా...నీ ఆలోచన ప్రకారం చూచినా జీవితంలో అవస్థలు వున్నాయి గదా! బాల్యం, కౌమారం, వానప్రస్థం, సన్యాసం...యిలా యేవేవో పేర్లతో విద్యార్థి దశ నుంచి నువ్వు సాక్షాత్తు చివరిస్థితికి ఎలా దూకెయ్యగలవ్?' అంది సరస్వతి.

'సైన్స్ మామూలు పరిణామాన్ని గురించి చెబుతూనే, "మ్యుటేషన్" అనేది ఒకటున్నదని చెబుతుంది గదా!' అన్నాడు నిర్లిప్తంగా నారాయణ, శంకరాచార్యులు వివేకానంద...యిలా ఉదాహరణలు తీసుకురావడం అతనికి యిష్టం లేదు.

'అయినా ఆలోచించు నారాయణా బాగా ఆలోచించు...నన్ను డిసప్పాయింట్ చేయడం నీకు ఉచితం కాదు...' అంది సరస్వతి, తన ప్రతిపాదనను అతను ఏమాత్రం అంగీకరించకపోవడంతో.

'నువ్వు ఎన్నయినా చెప్పు. నా విషయం నాకు తెలిసినంత స్పష్టంగా యింకొకళ్ళకు తెలియదుగదా! నన్ను యిలా వొదిలెయ్యరాదూ?'

'అదే! ఎందుకు వదిలెయ్యాలి అనే నేను అడుగుతున్నది!'

'ఎందుకంటే- నాకు ఇంద్రియసుఖాలమీద మక్కువ లేదు గనుక, ఇంద్రియలోలత్వాన్ని నేను సహించలేను గనుక. జీవితంలో దేనికీ అంటీముట్టనట్లుగానే

వుండి, దూరం నుంచి చూస్తూ కేవలం "అతిథి"గానే వుండిపోవడం నాకు యిష్టం-" నారాయణ మాటల్లో ఎలాంటి ఉద్వేగం లేదు, కళవెళపాటు లేదు.

'అలాగ! అలాగ!... నీకు యితరుల్ని గురించి "కన్‌సర్న్" లేదు. ఇతరులు నీకు పురుగుల్లాగ కనిపించరు కాబోలు-' అంది సరస్వతి దుఃఖంగా.

'బొత్తిగా అంత అన్యాయంగా మాట్లాడకు సరస్వతీ. నా మనస్సుకు ఉచితం అనిపించినట్లుగా నేను వ్యవహరించగలగాలి...యింకెవరో యేదో చెబుతున్నారని నాకు యిష్టంలేని పనులు చేయలేను గద! నన్ను క్షమించు. నా మీద అభిప్రాయాలు మార్చుకో. నీకిలాంటి అభిప్రాయులు కలిగించినందుకు నాదేమయినా పాత్రవుంటే అది అనాలోచితమే. అందుకయినా నన్ను క్షమించు...' అని, నారాయణ అనేకమార్లు చెప్పిన తరువాతగాని సరస్వతి అతన్ని పూర్తిగా పక్కకు పెట్టలేకపోయింది.

అయినా పూర్తిగా పక్కకు పెట్టిందనుకోవడం మటుకు రైటేనా?

పెళ్లయి యిద్దరు పిల్లలు పుట్టిన తరువాతకూడా యేమన్నది?

'నా జీవితం అన్యాయం అయిపోయింది. ఈ అన్యాయం చేసినవాడిని నువ్వే. దీన్ని ప్రతిఘటించలేను గనుక నోరునొక్కుకుని మనసు చంపేసుకుని సంసారం చేస్తున్నాను. జీవితాన్ని గురించి కాస్త ఆలోచించటానికి తీరుబడి దొరికనప్పుడల్లా నా మనసునిండా ఆక్రమించుకు కూర్చునేది నువ్వే నారాయణా!- యిప్పటికీ అంతే!' అంది ఆమె.

ఆమె కంఠంలో వెనకటి ఉక్రోషంలేదు; అలాగని పూర్తిగా సమాధానపడిపోయిన స్వరమూ కాదు అది.

తలవంచుకు కూర్చోవడం తప్ప యింకేం చేయలేదు నారాయణ.

అప్పటికీ అతను వివాహం చేసుకోలేదు. ఏదో పెద్ద ఉద్యోగం మటుకు చేస్తున్నాడు.

పెళ్లి చేసుకున్నావా? అనడిగింది సరస్వతి.

'ఉహు...చేసుకోనని చెప్పాను కదూ!'

'అదేకాదు- యింకా చెప్పావు, సన్యాసం పుచ్చుకుంటానని...'

అంది సరస్వతి, అబద్ధం ఆడి నాకు దొరికిపోయావని స్వరంలో స్పష్టం చేస్తూ.

'చెప్పాను. కాదనను. ఇకముందు సన్యాసం పుచ్చుకోవడమే కర్తవ్యం. ఇంకా ఓ సంవత్సరంన్నర గడువు వుంది-' అన్నాడు చిన్నపిల్లవాడిలాగ నారాయణ.

'దానికీ ముహూర్తం వగైరా వుంటాయా?' అంది ఎగతాళిగా.

'ఉంటాయి-' అన్నాడు తాపీగా.

సరస్వతి మరిన్ని వివరాలు అడిగి అతన్ని వేధించలేదు. అతని గొంతులో 'సిన్సియారిటీ' ఆమెను కాస్త కదిలించివుండాలి!

'నన్ను గురించి ఆలోచించడం అనవసరం, సరస్వతీ నీకు, నిన్ను గురించి- నీ సంసార బాధ్యతల్ని గురించి శ్రద్ధగా ఆలోచించుకో చాలు..." అన్నాడు నారాయణ.

అతన్ని భర్తకు పరిచయం చేసింది సరస్వతి.

'నా కాలేజీమేట్ సన్యాసం పుచ్చుకుంటాడు...' అని.

వెంకటస్వామి అతనివంక విచిత్రంగా చూచాడు. నారాయణ ముఖంలో అతనికేమీ దొరకలేదేమో సరస్వతి వంక తిరిగి 'ఎగతాళికయినా అర్థంపర్థంవుండాలి!' అన్నాడు.

'ఎగతాళికాదు-వేళాకోళం కాదు. ఓ సంవత్సరం, ఆరు నెలలు గడిచాక అతను చేయబోయేది యిదేనని యిప్పుడే ఓ అయిదు నిమిషాలముందు నాకు చెప్పాడు. అవునా, కాదా నారాయణా? మా ఆయన డిస్ట్రిక్ట్ జడ్జి. సాక్ష్యాలు ఆధారాలు లేకుండా ఒక్కటీ నమ్మరు...' అంది సరస్వతి.

నారాయణ యేమాత్రం కళవెళపాటు లేకుండా, ఆ గాంభీర్యంలోనే కొద్దిగా చిరునవ్వు ముఖానికి పులుముకుని 'అవునండీ! సరస్వతి చెబుతున్నది నిజమే-' అని అతను అన్నప్పుడు వెంకటస్వామి నిరుత్తరుడయి పోయాడు.

'అయితే మాయింటికి భిక్షకు రావాలి మీరు!' అన్నాడు, తేరుకున్న తరువాత.

నారాయణ నవ్వేసి ఊరుకున్నాడు.

'సన్యాసం పుచ్చుకోవడానికి ముందు ఒకమారు మాయింటికి భోజనానికి రా. భిక్షదాకా ఆగడం ఎందుకు? ఇంకా చాలా సమయం వుందిగా!' అంది సరస్వతి.

వెంకటస్వామి 'అవునవునండీ నాకు తోచనేలేదు. ఏమీ అనుకోకండి-' అన్నాడు.

నారాయణ వాళ్లయింటికి ఓ ఆదివారం అంతా గడపడానికి వెళ్లాడు. హాయిగా భోజనం చేశాడు. వెంకటస్వామి, సరస్వతీ, అతనూ అనేక సంగతులు మాట్లాడుకున్నారు సెలవు తీసుకుంటున్నప్పుడు సరస్వతి మళ్లీ గుర్తుచేసింది. 'ఆయన మాటలు మరిచిపోకు. భిక్షకు తప్పకుండా రావాలి!' అని.

'అప్పుడు పిలుస్తాం లెండి. మేం ఎక్కడవున్నా మిమ్మల్ని కనిపెడుతూనే వుంటాం...' అన్నాడు దర్పంగా వెంకటస్వామి.

అన్నట్లుగానే-సన్యాసం పుచ్చుకున్నాక కూడా వాళ్లు తనను వదలలేదు. నాలుగయిదు మార్లన్నా వెళ్ళివుంటాడు, వాళ్ల యింటికి భిక్షకు.

ప్రతిమారూ సరస్వతి తన సంసారతాపత్రయాలన్నీ చెప్పుకునేది. వీలయినప్పుడల్లా తనను నిష్ఠూరాలు ఆడేది. నా జీవితమంతా తల్లక్రిందులు చేసేసింది నువ్వేననేది. దీనికి భగవంతుడు నిన్ను క్షమిస్తాడో లేదో నాకు తెలియదు - అనేది.

భగవంతుడి దాకా ఎందుకు, నువ్వు క్షమిస్తావా లేదా?- అని నిర్మలానందస్వామి ఎప్పుడూ అడగలేదు. ఆమె క్షమించడం అవసరం అని అతను భావించడం లేదు. ఎవరి యిష్టం వచ్చినట్లు వాళ్లు అనుకుంటారు. ఒకళ్ల యిష్టాలు, అభిప్రాయాలు - మరొకళ్ళను కట్టిపడవేయవు, బంధం తీసుకురావు-వాటికి నువ్వు కూడా సమంగా అనుస్పందన పొందితే తప్ప!- అని అతడికి తెలుసు. సరస్వతి ఎంత నిష్ఠూరంగా మాట్లాడినా, నిర్మలానందస్వామి

ఉలకడు, పలకడు. అవుననీ, కాదనీ అనడు. ఆ మాటలు అతన్ని నిజంగా తాకుతున్నాయా లేదా అనేది కూడా అనుమానమే సరస్వతికి. ఓ మూడేళ్ల కిందట కాబోలు- ఆమె వచ్చినప్పుడు అంది, ఇద్దరం పెద్దవాళ్లం అయిపోయినాం. నా జీవితంలో అశాంతి యిచ్చావు నువ్వు. శాంతికూడా నీవే యిస్తావు. నాకు తెలుసు!'

'నీకేం కావాలనుకుంటున్నావు సరస్వతీ!' అని అడిగాడు అప్పుడు నిర్మలానందస్వామి.

'మావూళ్లో ఆశ్రమానికి బదిలీ చేయించుకో నువ్వు. వారానికోసారన్నా నిన్ను చూడనివ్వు-' అంది.

'ఇంకో సంవత్సరం తర్వాత వస్తాను-' అన్నాడు.

అన్నట్లుగానే - అతని ప్రయత్నం అవసరం లేకుండానే వచ్చాడు. రోజు విడిచి రోజు సరస్వతి చూచిపోతూ వుండేది. ముందు తరువాత వారానికి ఒకమారు వచ్చేది.

పోయినమారు-చివరిసారి అదే అని అతను ఎరుగును-ఆమెకు కూడా తెలుసునేమో తెలియదు; ఆమె వెళ్లిపోవటానికి ముందు 'ఈమారు జీకు సాష్టాంగదండ ప్రణామం చేస్తాను-' అంది.

ఆమె తన పాదాలు తాకుతూ వుంటే-

'యతిని గదా!' అన్నాడు.

ఆమె అతని వంక సూటిగా చూస్తూ 'యతివేకాదు, శిలవు నువ్వు!' అంది.

ఆమె కళ్లల్లో లాలన, లాలన అతి స్పష్టంగా కనిపించాయి అతనికి, నిర్మలానందస్వామికి...

నారాయణ గదిలోనికి వచ్చాడు.

'స్వామీ ఏకాంత సేవకు అవసరం అయిన పన్నీరు పురమాయించారు గదా మీరు, అది తయారుచేసుకువచ్చిన ఆసామి మిమ్మల్ని చూడాలని వచ్చాడు-' అని విన్నవించుకున్నాడు.

ఆ ఆసామి రావడమే కాదు.

పన్నీరు బుడ్లు స్వామివారి చెంతవుంచి నమస్కరించాడు.

వార్త-ఆదివారం, 1998

◆